పేదలకు జేబులో వంద రూపాయలు కరవైంది

- ఏం సాధించారని కూటమి సంబరాలు చేసుకుంటోంది
- పథకాలను ఎప్పుడు అమలు చేస్తారు?
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



పుట్టపర్తి సర్కిల్‌లో భారీగా తరలి వచ్చిన ప్రజలు



మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు వినతి పత్రం అందిస్తున్న రాచమల్లు శివప్రసాదరెడ్డి



ర్యాలీలో పాల్గొన్న మహిళలు

ప్రొద్దుటూరు : ప్రజలు తినడానికి తిండిలేని పరిస్థితి.. జేబులో వంద రూపాయలు కనిపించడం లేదని మాజీ ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా స్థానిక పుట్టపర్తి సర్కిల్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు రెండు కిలోమీటర్ల మేర వేలాది మహిళలతో బుధవారం ర్యాలీ అట్టహాసంగా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలే నిరసన తెలిపారని, వందలాది మహిళలు రోడ్లపైకి వచ్చారన్నారు. జగన్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల ప్రభావం కారణంగా మహిళలు బ్యాంకుల్లో ఉండేవారని, చంద్రబాబు ప్రభుత్వంలో వారంతా రోడ్లపైకి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు 365 రోజులైనా..ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. కొత్త పింఛన్లు ఇవ్వడం లేదు.. అమ్మ ఒడి పథకం ఊసే లేదు. ఉచిత బస్సు కనిపించడం లేదని ఆరోపించారు. ఎన్నికల ముందు రాష్ట్రమంతా ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశపెడతామని చెప్పి ఇప్పుడు మాట మార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్తు బిల్లులు పెంచబోమని చెప్పడంతోపాటు నాణ్యమైన కరెంటు ఇస్తామని ప్రజలను నమ్మించారన్నారు. అమాంతంగా విద్యుత్ బిల్లులను పెంచారని, నాణ్యమైన కరెంటు ఇవ్వడం లేదన్నారు. పరిస్థితి ఇలా ఉంటే కూటమి నేతలు మాత్రం ఏడాది కాలంలో రాష్ట్రం అభివృద్ధి చెందిందని గొప్పలు చెబుతున్నారన్నారు. ర్యాలీకి 10వేల మందికి హాజరవడం చస్తే చంద్రబాబుపై వ్యతిరేకత స్పష్టమవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు ఆయిల్ మిల్ ఖాజా, పాతకోట బంగారు మునిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు కల్లూరు నాగేంద్రారెడ్డి, ప్రొద్దుటూరు, రాజుపాళెం మండల కన్వీనర్లు మార్తల ఓబుళరెడ్డి, బాణా కొండారెడ్డి, ఈదుల లక్ష్మీనారాయణరెడ్డి, గుద్దేటి రాజారాంరెడ్డి, వరికూటి ఓబుళరెడ్డి, గరిశపాటి లక్ష్మీదేవి, రాగుల శాంతి, గుర్రం లావణ్య, కోనేటి సునంద, డీలర్ అంజి, లక్ష్మీనారాయణరెడ్డి, రాఘవేంద్రారెడ్డి, వీరారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, గ్రామ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు

వెన్నుపోటు దినం ర్యాలీలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్థానిక పుట్టపర్తి సర్కిల్ నుంచి శ్రీరాములపేట మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు జరిగిన బారులు తీరిన మహిళలు కూటమి సూపరిపాలనకు అడ్రెస్ లేదు.. రెడ్ బుక్ పాలనకు అడ్డు లేదు, కూటమి హామీలకు గతి లేదు – చంద్రబాబు హామీలకు నీతి లేదు, జాబ్ క్యాలెండర్ ఏమైంది బాబు, హామీలకు బాధ్యత నాది అన్న పవన్.. అడ్రెస్ ఎక్కడ, తల్లికి వందనం ఎప్పుడు అమలు చేస్తారు?, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎండ మావేనా..., నాడు సొంత మామకు వెన్నుపోటు – నేడు నిరుద్యోగులకు వెన్నుపోటు అంటూ నినాదాలు చేశారు. వెన్నుపోటు వీరుడు చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ జేష్టాది శారద, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎంపీపీ శేఖర్‌యాదవ్, రాజుపాళెం జెడ్పీటీసీ జీరెడ్డి అంజనీకుమారి, గోవర్ధన్‌రెడ్డి, మల్లేల ఝాన్సీరాణి, గజ్జల కళావతి, పన్నీటి కాశయ్య, గోటూరు వెంకటేష్ పాల్గొన్నారు.

మోసం.. చంద్రబాబు నైజం



పోరుమామిళ్ల: ర్యాలీలో భారీగా పాల్గొన్న వైఎస్సార్‌సీపీ అభిమానులు

- ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : ఎన్నికల సమయంలో ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇవ్వడం.. అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసగించడం చంద్రబాబు నైజమని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా చేసిన మోసాన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం బద్వేలులో నిర్వహించిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం విజయవంతమైంది. స్థానిక సిద్దవటం రోడ్డులోని ఎన్జీవో రోడ్డు వద్ద గల వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం నుండి నాలుగురోడ్ల కూడలి మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఏ.ఓ.కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలతో పాటు మరో 143 హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి చంద్రబాబునాయుడు వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారని ధ్వజమెత్తారు. తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ, శ్రీశక్తి, మహిళలకు ఉచిత బస్సు, మూడు గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలను అమలు చేయకుండా విద్యార్థులను, యువతను, మహిళలను, రైతులను మోసగించారని అన్నారు.కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసేంత వరకు ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తూనే ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యరెడ్డి, నియోజకవర్గ బూత్‌కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, పీ.నాగార్జునరెడ్డి, మునిసిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, గురుమోహన్, యద్దారెడ్డి, బంగారు శీనయ్య, చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సుందరరామిరెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, రవిచంద్రారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, సి.బాషా, హనుమంతరెడ్డి, సుదర్శన్, సత్యనారాయణరెడ్డి, పోలిరెడ్డి, అంకన గురివిరెడ్డి, ముత్యాల ప్రసాద్, దావీదు, గోపాలస్వామి, సాయిక్రిష్ణ, జిరామసుబ్బారెడ్డి, పెద్దపోలిరెడ్డి, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, రాళ్లపల్లి నరసింహులు, మాధవరెడ్డి, యోగానందరెడ్డి, లక్ష్మీనరసారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కేశవరెడ్డి, డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, డాక్టర్ బి.మునెయ్య, మునిసిపాలిటీ, పుత్తా శ్రీరాములు, సుబ్బారెడ్డి, వీరారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, హరిక్రిష్ణారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, గురివిరెడ్డి, మస్తాన్, చిత్తా ప్రణీత్‌రెడ్డి, సాయి నారాయణరెడ్డి, పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : బద్వేలులో బుధవారం జరిగిన వెన్నుపోటు కార్యక్రమం విజయవంతమయిందని రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీ రాళ్లపల్లె నరసింహులు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు రాజీవ్‌బాషా, వైస్ ఎంపీపీ సీఎం బాషా పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం పోరుమామిళ్ల పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా అభిమానులు భారీగా తరలివచ్చారని తెలిపారు.

వెన్నుపోటు చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య

- అభివృద్ధి అంటే అమరావతికే పరిమితమా
- అభివృద్ధి, సంక్షేమం ఏం చేశారో 12వ తేదీ లోపు చెప్పాలి
- మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి
- మైదుకూరులో వెన్నుపోటు దినం విజయవంతం



ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి

మైదుకూరు : వెన్నుపోటు పొడవడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేయడంపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం మైదుకూరులో వెన్నుపోటు దినం పేరుతో నిర్వహించిన భారీ ర్యాలీ విజయవంతమైంది. పట్టణంలోని వనిపెంట రోడ్డులో ఉన్న శ్రీ అంకాలమ్మ దేవాలయం వద్ద నుంచి నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి వచ్చిన వేలాది మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులు చేతపట్టి ర్యాలీలో కదం తొక్కారు. బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ, తల్లికి వందనం లేదు. నాన్నకు బుడ్డీ, ఉద్యోగాలు ఇచ్చుడు లేదు పీకుడే, బాబును నమ్ముకో ఉన్నది అమ్ముకో అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు హోరెత్తించారు. స్థానిక మార్కెట్ కూడలిలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి, రాయల కూడలిలోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి, ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి ర్యాలీని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వరకు నిర్వమించారు. అనంతరం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేయడంపై చంద్రబాబు సమాధానం ఇవ్వాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి తదితరులు ఎంపీడీఓ కార్యాలయం ఏఓ నాగేంద్రబాబుకు వినతి పత్రాన్ని అందజేశారు.

అభివృద్ధి అంటే అమరావతికే పరిమితమా?

ర్యాలీ అనంతరం మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయినా చంద్రబాబు రాష్ట్రంలో అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. చంద్రబాబు దృష్టిలో అభివృద్ధి అంటే అమరావతికే పరిమితం అని విమర్శించారు. వైఎస్ జగన్ హయాంలో ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలల రూపురేఖలు మారిపోయాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయాల భవనాలు, రైతు భరోసా, ఆరోగ్య కేంద్రాలు వెలిశాయని తెలిపారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నుంచి గ్రామీణ రహదారుల వరకు నిర్మాణం జరిగి ప్రజలకు రవాణా పరంగా మేలు జరిగిందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు ఒక్క రోడ్డు అయినా వేశారా అని చెప్పాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి, సంక్షేమంపై 12వ తేదీ లోపు చెప్పాలి

రాష్ట్రంలో అభివృద్ధి లేదు.. సంక్షేమం లేదని మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ధ్వజమెత్తారు. తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఉన్న ప్రతి పిల్లవాడికి రూ.15వేలు ఇస్తామన్నారు. అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు రూ.20వేలు, ఆడ బిడ్డ నిధి కింద 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు రూ.1500, ఉచిత బస్సు, మూడు సిలిండర్లు ఇస్తామని ఏడాది గడిచినా ఏ ఒక్కటీ నెరవేర్చలేదని ఆరోపించారు. లోకేష్ యువగళం పేరుతో నిర్వహించిన యాత్రలో అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగులకు రూ.3వేలు భృతి ఇస్తామని హామీ ఇచ్చి ఆ సంగతే మరిచిపోయారని ఆరోపించారు. జిల్లాకు చెందిన రవాణా మంత్రి ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు అమలు చేస్తామన్నారని, ప్రతి ఏడాది ఆగస్టు 15 వస్తుందని ఏ సంవత్సరం అమలు చేస్తారో చెప్పాలన్నారు. వలంటీర్లకు రూ.10వేలు ఇస్తామని వారిని నట్టేట ముంచారని విమర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ రాష్ట్ర మాజీ ప్రభుత్వ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, మైదుకూరు మండల నాయకులు ఏవీ సుబ్బారెడ్డి, రఘురామిరెడ్డి, గల్లా నరసింహారెడ్డి, కేపీ లింగన్న, థామస్, మహబూబ్ షరీఫ్, బండి నాగేంద్ర ప్రసాద్, నేట్లపల్లె శివరాం, కిరణ్మయి, ఇడగొట్టు శేషు, ఖాదర్, చొక్కం సంజీవరాయుడు, మాబుచాంద్, ధనలక్ష్మి, చాపాడు మండల నాయకులు తెలిదేల లక్ష్మయ్య, శాంతరాజు, చాపాటి రాజశేఖర్‌రెడ్డి, శెట్టిపల్లె సిద్దారెడ్డి, టీఓపల్లె రవిశంకర్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, ఖాజీపేట మండల నాయకులు డి.శ్రీనివాసులరెడ్డి, రాఘవరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, గంగిరెడ్డి నాగిరెడ్డి, దువ్వూరు మండల నాయకులు ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, గుడిపాడు బాబు, రవికుమార్, ఓబుళరెడ్డి, బ్రహ్మంగారిమఠం మండల నాయకులు పెద్దిరెడ్డి చిన్న ఓబుళరెడ్డి, రేకులకుంట వెంకటయ్య, పాణి, నిత్య పూజా రెడ్డి, మోహన్‌రెడ్డి, రామగురివిరెడ్డి, దుగ్గిరెడ్డి, యత్తపు సుబ్బారెడ్డి, నేలటూరి సుబ్బారెడ్డి, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

బి.కోడూరు: మండలంలోని రెడ్డివారిపల్లె గ్రామంలో బుధవారం నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం వేద పండితులు కనుమళ్ల సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా మొదలైంది. గ్రామంలోని మహిళలు, దంపతులతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాలలోని ప్రజలు కూడా పాల్గొని విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని తిలకించారు.

ఆలయ వార్షికోత్సవం

ఖాజీపేట : సుంకేశుల దళితవాడలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రజలు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ప్రజల పక్షాన సీపీఐ

పోరుమామిళ్ల : సీపీఐ పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని తిరుపతిరెడ్డి కాలనీలో పోరుమామిళ్ల ప్రాంతీయ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతిరెడ్డి కాలనీలో 11 ఏండ్లుగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలు పట్టాల కొరకు ఎదురు చూస్తున్నారన్నారు. గతంలో ఆర్డీఓ వెంకటరమణ పర్యటించారని, రెవెన్యూ అధికారులు రెండుసార్లు విచారణ చేశారని, పదిమంది తహశీల్దార్లు మారారని, అయినా పేదలకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతిరెడ్డికాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. సభలో ఏరియా కార్యదర్శి మస్తాన్, మండల కార్యదర్శి రవికుమార్, కార్యవర్గసభ్యులు రమణ, జాకోబ్, చెన్నయ్య, సునీల్, వెంకటేశ్వర్లు, బెల్లంబాషా, రవీంద్ర, రేణుకమ్మ, విశ్వాసమ్మ, జ్యోతి, శ్రీనివాసులు, షాహిదా పాల్గొన్నారు. అనంతరం పోరుమామిళ్ల శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దే రేషన్

చాపాడు : వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరకులను డీలర్లు తీసుకెళ్లి అందజేయాలని జమ్మలమడుగు ఆర్డీఓ సాయి శ్రీ పేర్కొన్నారు. బుధవారం చాపాడు ఎస్సీ కాలనీలో నడవ లేని స్థితిలో ఉన్న సరోజమ్మ, మహాలక్ష్మమ్మలకు వారి ఇంటి వద్దనే రేషన్ సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా హాజరైన ఆర్డీఓ మాట్లాడుతూ.. ప్రతి నెలా క్రమం తప్పకుండా వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇంటి వద్దకు సరకులను చేర్చాలన్నారు. సరకులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అందించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తిదారులను ఆదరించాలి



రైతు ఉత్పత్తిదారుల పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

చాపాడు : పకృతి వ్యవసాయంపై రైతుల్లో ఆదరణ పెరుగుతోందని, పకృతి వ్యవసాయ ఉత్పత్తిదారులను ప్రతి ఒక్కనూ ఆదరించాలని సుస్థిర వ్యవసాయ కేంద్రం రాష్ట్ర సమన్వయకర్త ఆదినారాయణ, నాబార్డు డీడీఎం విజయ విహారి పేర్కొన్నారు. మండల కేంద్రమైన చాపాడులో ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తిదారుల కంపెనీ కొత్త ఆఫీసును బుధవారం ప్రారంభించి, పాలకవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదినారాయణ, విజయ విహారి మాట్లాడుతూ బ్యాంకు అధికారులు మహిళా సంఘాలకు రుణాలు ఇచ్చినట్లు రైతు సంఘాలకు కూడా ఇస్తారన్నారు. ఇదే క్రమంలో ఉత్పత్తి రైతులకు నిరంతరం ఆఫీసు అందుబాటులో ఉందని, వారికి కావాల్సిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, పనిముట్లు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాయన్నారు. రైతు సమస్యల పరిష్కారం కోసం కిసాన్ మిత్ర హెల్ప్ లైన్ 8500983300కి కాల్ చేయాలని జయన్న తెలిపారు. సీఎస్ఏ సంస్థ ఆదినారాయణ, చైర్మన్ సుబ్బరాయుడు, పాలక వర్గ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, ఓబుళరెడ్డి, బ్యాంకు అధికారులు మల్లికార్జున నాయుడు, కేవీఆర్ రమణ, సమీర్, సుబ్బరామయ్య, బసవయ్య, సీఎస్ఏ సిబ్బంది రమణ, రవితేజ, ఓబులేసు పాల్గొన్నారు.

మాన్యువల్ కౌన్సిలింగ్ విధానంలో బదిలీలు ఉండాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : రాష్ట్రంలోని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలను మాన్యువల్ కౌన్సిలింగ్ విధానంలో నిర్వహించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదికకు ఇచ్చిన హామీ మేరకు మ్యాన్యువల్ విధానంలో కౌన్సిలింగ్ నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రొవిజనల్ సీనియారిటీ జాబితా సకాలంలో వెబ్ సైట్‌లో పొందుపరచకుండా, అభ్యంతరాలు, సాంకేతిక సమస్యలను పరిష్కరించకుండా హడావుడిగా వెబ్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు నిర్వహించడంతో గందరగోళం నెలకొందన్నారు. స్కూల్ అసిస్టెంట్ల బదిలీలకు ఆప్షన్ పెట్టుకొనే సమయాన్ని రెండు రోజులపాటు పొడిగించాలన్నారు. అసంబద్ధ విధానాలతో రాష్ట్ర వ్యాప్తంగా వేలాది సబ్జెక్టు టీచర్లను మిగులుగా చూపించారన్నారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు విడతల డీఏలను వెంటనే ప్రకటించాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, జిల్లా కౌన్సిలర్లు సుబ్బయ్య, రమణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు గురివిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భూములు పంపిణీ చేయాలి

కలసపాడు : పేదల వలసలను నివారించడానికి కూటమి ప్రభుత్వం భూమి పంపిణీ చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్, జిల్లా ఉపాధ్యక్షుడు వీరయ్య, గురయ్య డిమాండ్ చేశారు. బుధవారం కలసపాడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అన్వేష్ మాట్లాడుతూ పొరుగు రాష్ట్రం తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు భూ పంపిణీ చేస్తోందని తెలిపారు. భూమి లేని గ్రామాల్లో వారికి ఏడాదికి రూ.15వేలు ఇస్తోందని, అలాగే జిల్లాలోని కలసపాడు, కాశినాయన, బి.కోడూరు, పోరుమామిళ్ల, బ్రహ్మంగారిమఠం, మైదుకూరు తదితర మండలాల్లో లక్షలాది ఎకరాలు స్థానికేతురులు ఆక్రమించుకున్నారన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకుడు హుస్సేన్ పీరా, సుబ్బరాయుడు, మహిళా నాయకురాలు విజయమ్మ పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం కామసముద్రం అంకాలమ్మ

అట్లూరు : అమ్మమాయమ్మ అంకాలమ్మో అంటే భక్తులను కాపాడేందుకు కామసముద్రం అంకాలమ్మ పలుకుతుంది. కామసముద్రంలో వెలసిన అంకాలమ్మకు మూడేళ్ల ఒకసారి తిరునాల నిర్వహించడం ఆనవాయితీ. ఈ నెల 6,7,8 తేదీల్లో తిరునాలను నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాటు పూర్తి చేశారు. స్వయంభువుగా వెలసిన ఈ తల్లిని దర్శించుకునేందుకు జిల్లా వ్యాప్తంగా భక్తులు సైతం వస్తుంటారు. కులమతాలకు అతీతంగా, ఈ అమ్మవారిని దర్శించుకోవడం ప్రత్యేకత. కామసముద్రం అంకాలమ్మ అమ్మవారు శక్తి స్వరూపిణి. మసూచి, కలరా, వంటి భయంకరమైన వ్యాధులు రాకుండా ప్రజలు, పశువులను అమ్మవారు కాపాడుతుందని నమ్మకం. తిరునాల సందర్భంగా మండల పరిధిలోని ముప్పై గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంటుంది. తిరునాల ఖరారు కావడంతో ఈ ప్రాంతం నుంచి విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు స్వగ్రామాలను చేరుకుంటున్నారు. తిరునాల మూడు రోజుల పాటు అంకాళమ్మ ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేయనున్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

పోరుమామిళ్ల : రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండులో జయశంకర్ కళాజాత బృందం హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. సురక్షితంకాని లైంగిక సంబంధాలు, కలుషిత రక్తం, తల్లి నుండి బిడ్డకు, హెచ్‌ఐవీ సోకిన వారి నుండి సిరంజీ, బ్లేడు ద్వారా హెచ్‌ఐవీ వస్తుందన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత పరీక్షలు చేస్తారని, ఎయిడ్స్, హెచ్‌ఐవీపై అవగాహన కల్పించడంతో పాటు ఉచితంగా మందులు ఇస్తారని కళాప్రదర్శన ద్వారా తెలిపారు. కళాజాత బృంద సభ్యులతో పాటు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ ఖాదర్‌బాషా, ల్యాబ్ టెక్నీషియన్ సుధాకర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి వెలకట్టలేనిది

గోపవరం : ఉపాధ్యాయ వృత్తి వెలకట్టలేనిదని ఉప విద్యాధికారి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉదయం బద్వేల్‌లోని బుచ్చిరెడ్డి కల్యాణ మండపంలో మండల విద్యాశాఖాధికారులు చెన్నయ్య, రఘురామిరెడ్డి అధ్యక్షతన గోపాల్‌రెడ్డి పదవి విరమణ సన్మాన సభ నిర్వహించారు. అనంతరం గోపాల్‌రెడ్డి దంపతులను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. రవిశంకర్, నరసింహారెడ్డి, తిరుపతి రెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేషన్ కోసం వృద్ధుల పాట్లు

ఖాజీపేట : రేషన్ కోసం వృద్ధులు పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. వేలిముద్రలు సక్రమంగా పడకపోవడంతో ఆధార్ కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సిన సంఘన చోటుచేసుకుంది. ఖాజీపేట మండలం సుంకేశుల గ్రామంలోని సుమారు 40 మందికి రేషన్ తీసుకునే ప్రయత్నం చేయగా అందులో చాలా మందికి వేలిముద్రలు సక్రమంగా పడలేదు. దీంతో అందరూ ఆధార్ కేంద్రం వద్దకు వెళ్లి వేలి ముద్రలు వేయాలని అధికారులు సూచించారు. దీంతో వారంతా ఖాజీపేటలోని తహసీల్దార్ కార్యలయం వద్ద ఉన్న ఆధార్ కేంద్రం వద్దకు వచ్చి వేలిముద్రలు వేసే ప్రయత్నం చేశారు. ఆధార్ కేంద్రం వద్దనే వృద్ధులు గంటల తరబడి వేచి ఉండి వేలిముద్రలు వేయించుకున్నారు. ప్రతి ఒక్కరికీ రేషన్ ఇవ్వాల్సిందేనని డిప్యూటీ తహసీల్దారు ఓబయ్య పేర్కొన్నారు. వేలిముద్రలు పడని వారికి ఇంటిలో ఎవరైనా ఫింగర్ వేసి రేషన్ తీసుకోవచ్చునని వివరించారు.

బహుమతుల ప్రదానం

చాపాడు: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిర కార్యక్రమంలో భాగంగా బుధవారం వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గ్రంథాలయ అధికారి జే.శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏప్రిల్ 28వ తేదీ నుంచి విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. చివరి రోజున గెలుపొందిన విద్యార్థులకు ఎంఈఓలు రవిశంకర్, వంశీకృష్ణల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

ముగిసిన శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు



స్వామి, అమ్మవార్లకు చక్రస్నానం నిర్వహిస్తున్న వేద పండితులు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని కొండా వధూతాశ్రమం గోవిందయ్య మఠం ఆవరణలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గత ఆరు రోజులుగా జరుగుతున్న ఆలయ ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఉదయం మహాపూర్ణాహుతి నిర్వహించి స్వామి, అమ్మవార్లను అశ్వ వాహనంపై ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించి శాస్త్రోక్తంగా చక్రస్నానం చేయించారు. సాయంత్రం ఆలయంలో అంగరంగ వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. అందులో భాగంగా వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని తిలకించారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి, రామలింగారెడ్డి, నారాయణరెడ్డి, శ్రీధర్, మల్లేశ్వరి, సుభద్రమ్మ, జయరామిరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు రమేష్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

మతసామరస్యంతో పండగలు నిర్వహించాలి

బద్వేలు అర్బన్ : పండుగలను మతసామరస్యంతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని అర్బన్ ఎస్ఐ ఎం. సత్యనారాయణ పేర్కొన్నారు. బక్రీదు పండుగ సందర్భంగా బుధవారం స్థానిక అర్బన్‌స్టేషన్ ఆవరణలో హిందూ, ముస్లిం మతపెద్దలతో నిర్వహించిన పీస్‌కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు, మతపెద్దలు పోలీసులకు సహకరించాలన్నారు. నిబంధనలను తప్పనిసరిగా పాటించి ప్రశాంత వాతావరణంలో పండుగ నిర్వహించుకోవాలన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా చట్టాలను గౌరవిస్తూ పండుగ జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో అర్బన్ ఎస్ఐ–2 జయరామిరెడ్డి, హిందూ, ముస్లిం మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మట్టి పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం

మైదుకూరు : మట్టి నమూనా పరీక్షల ఆధారంగా పంటల సాగులో ఎరువుల వినియోగం చేయాలని మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాలను బుధవారం దువ్వూరు మండలంలో నిర్వహించారు. శాస్త్రవేత్త బాలకృష్ణ అధ్యక్షతన గుడిపాడు, మదిరేపల్లె, నీలాపురం, చిన్నసింగనపల్లె గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ మట్టి నమూనాల ఆధారంగా రసాయనిక ఎరువులను వినియోగించాలని సూచించారు. జీవ రసాయనిక ఎరువుల వినియోగం వల్ల భూమికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు. జాతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ సుబ్బరాయుడు, డాక్టర్ శ్యాంప్రసాద్, డాక్టర్ ఉమాకాంత్ చిరుధాన్యాల రకాలు, ఆవశ్యకత, యాజమాన్య పద్ధతులు, పోషక విలువల గురించి వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు భాగవతప్రియ, ఫిరోజ్ ఖాన్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలం దక్కేవరకు పోరాటం

మైదుకూరు : ప్రతి పేదవానికి ఇంటి స్థలం, వ్యవసాయ భూమి దక్కే వరకు పోరాటం చేస్తామని స్థానిక సీపీఐ నాయకులు పేర్కొన్నారు. బుధవారం మైదుకూరులో సీపీఐ భూ పోరాట సదస్సు నిర్వహించింది. సదస్సులో ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా నిరుపేదలు ఇంటి స్థలం కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టు కాళ్లరిగేలా తిరిగినా ఇళ్ల స్థలాలు పంపిణీ చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ఇళ్లులేని పేదలందరినీ సమీకరించి భూ పోరాటానికి సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీరాములు, శివరాం, షావలి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.